క్లుప్తంగా

రామలింగేశ్వర స్వామికి తొలి ఏకాదశి అభిషేకం



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని రామలింగేశ్వరస్వామికి అభిషేకార్చనలు, అమ్మవారికి శాకాంబరీ అలంకారం విశేష పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సామాన్యుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి



లక్ష్మీపురం: మోదీ ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో సామాన్య పౌరుల సంక్షేమంపై దృష్టి సారించాలని, చిన్న వ్యాపారాలను పెంచేందుకు మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు తయారీ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని అర్థశాస్త్ర శాఖాపన్యాసకులు సి.హెచ్. సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై బుధవారం చర్చా గోష్టి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తన దృష్టిని కొంత వరకు క్షేత్ర స్థాయి ఆర్థిక సంక్షేమం వైపు మళ్లించటం చాలా అవసరమన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్లేషకులు ఇ.చంద్రయ్య మాట్లాడారు.

చిన్నబజారులో అన్నదానం



పట్నంబజారు: మొహర్రంను పురస్కరించుకుని నియోజకవర్గంలోని 12వ డివిజన్ చిన్నబజారులో మసీదు వద్ద న్యాయవాది లియాఖత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు రానున్న రోజుల్లో అంతా మంచి జరగాలని భగవంతుడిని ప్రార్థించామని, నియోజకవర్గ ప్రజలకు మొహర్రం, తొలి ఏకాదశి శుభాకాంక్షలను తెలిపారు. మొహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని స్మరించుకుంటూ ముస్లిం సోదరులు మొహర్రం పండుగ నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సలీం, బాబు, కరీముల్లా, రఫీ, గౌస్, రహంతుల్లా, పెదబాబు పాల్గొన్నారు.

రాజకీయ పరిణామాలపై అధ్యయనం

నెహ్రూనగర్: కారంచేడు, చుండూరు ఉద్యమాల స్ఫూర్తితో 4 దశాబ్దాల దళితోద్యమాలు, సామాజిక రాజకీయ పరిణామాలు అనే అంశంపై దేశ వ్యాప్తంగా 2024 జులై 17 నుంచి 2025 జులై 17 వరకు అధ్యాయనాలతో పాటు సమీక్షలు నిర్వహించనున్నట్లు డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కారంచేడు దళిత ఆత్మగౌరవ సభ అరండల్‌పేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాటు సమీక్షలు నిర్వహించి 2025 ఆగస్టు 6న జాతీయ స్థాయిలో సామాజిక రాజకీయ ఉద్యమ శక్తులతో సమ్మేళనం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పొందుగల ప్రకాష్, బుస్సా రత్నప్రసాద్, ఎం సునీల్ కుమార్, విప్పర్ల విజయ్ భాస్కర్, తురక మంగయ్య, మేడి శామ్యూల్, నాగబాబు, వాల్మీకి శ్రీనివాసరావు, ఏ గాలయ్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట సిద్దేశ్వర పీఠ పాలిత ఓంకార క్షేత్ర ప్రాంగణంలో బుధవారం గాయత్రి సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సద్గురు శ్రీనారాయణ తీర్థ జయంతి మహోత్సవాలు జరిగాయి. అనంతరం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ కార్యదర్శి ఎన్. నారాయణమూర్తి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. స్థానిక కళాకారులు 20 మంది తమ గాత్రధారులతో నారాయణ తీర్థుల విరచిత తరంగాలను శ్రావ్యంగా ఆలపించారు. సన్మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎం.వై.శేషరాణి పర్యవేక్షించారు.

మెమోగ్రామ్‌తో క్యాన్సర్ నిర్ధారణ సులువే

- ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న బ్రెస్ట్ క్యాన్సర్లు
- జీజీహెచ్‌లో ఉచితంగా వైద్య పరీక్షలు, ఆపరేషన్లు

'ప్రత్తిపాడుకు చెందిన ఓ మహిళ రొమ్ములో నొప్పిగా ఉన్న పట్టించుకోకుండా పొలం పనులు చేసుకుంటూ కాలయాపన చేసింది. అత్యవసర స్థితిలో వైద్యులను సంప్రదించింది. ఎక్కువ కాలంగా చికిత్స చేయించుకోకపోవటంతో క్యాన్సర్‌గా మారినట్లు నిర్ధారించి చికిత్స చేయించారు.' ఎక్కువ మంది సమస్యను సకాలంలో గుర్తించి చికిత్స చేయించకపోవటం వల్లే రొమ్ము క్యాన్సర్ కేసులు ప్రతి ఏడాది పెరిగిపోతున్నాయని క్యాన్సర్ వైద్య నిపుణులు చెబుతున్నారు.

గుంటూరు మెడికల్: ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 2022లో ప్రపంచ వ్యాప్తంగా 2.3 మిలియన్ల మంది రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. ఆ ఏడాది 6.70 లక్షల మంది చనిపోయినట్లు గణంకాలు చెబుతున్నాయి. ప్రతి 12 మందిలో ఒకరు తమ జీవిత కాలంలో రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నట్లు నిర్ధారించారు. యవ్వనంలోకి అడుగుపెట్టే 16 ఏళ్ల యువతి మొదలుకొని 60 ఏళ్ల వృద్ధురాలు వరకు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒకరు ఈ వ్యాధికి బలవుతున్నారు. ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు.

గుర్తించడం ఇలా..

రొమ్ములో గడ్డలు, చంకలో గడ్డలు ఉంటే రొమ్ము క్యాన్సర్‌గా అనుమానించాలి. రొమ్ములపై చర్మం ముడతలు పడటం, గట్టిగా మారడం, గుంటలు పడటం, నారింజ రంగులోకి మారితో అనుమానించాలి. చనుమొనలు నొక్కితే సరిగా లోపలికి వెళ్లకపోయినా, రెండు రొమ్ములు కూడా సైజుల్లో తేడాలు ఉండే వైద్యులను సంప్రదించాలి. చనుమొనల నుంచి తెలుపు, పసుపు, ఎరుపు రంగుల్లో ఏదైనా ద్రవం బయటకు వస్తే రొమ్ము ఛాతిపై ఉన్న చర్మం లోపలికి వెళ్లి చర్మం చొట్టలు పడుతుంది. బ్రెస్ట్ నిపుల్స్(చనుమొనలు) చుట్టూ ఉండే చర్మం పొలుసులుగా మారి రాలి పోతుంది.

కారణాలు....

జన్యుపరమైన కారణాలు, వాతావరణంలో వస్తున్న మార్పుల వలన రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. అధిక బరువు, ఆల్కహాల్, పొగాకు వినియోగం, 30 ఏళ్ల వరకు గర్భం దాల్చని వారిలో, అసలు గర్భం దాల్చని వారిలో రొమ్ము క్యాన్సర్ రావొచ్చు. చిన్న వయస్సులోనే రజస్వల అవ్వటం, ఆలస్యంగా నెలసరి ఆగిన వారికి వచ్చే అవకాశం ఉంది.



మెమోగ్రామ్ మిషన్

2017లో	321 మంది
2018లో	123 మంది
2019లో	217 మంది
2020లో	13 మంది
2021లో	35 మంది
2022లో	100 మంది
2023లో	558 మంది
2024 జూన్ వరకు	84 మంది

వైద్య సేవలు ఇలా...

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించే వైద్య పరికరం మెమోగ్రఫీ అందుబాటులో ఉంది. పేదలకు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నాట్కో ట్రస్ట్ వారు రూ. కోటి విలువైన త్రీడీ డిజిటల్ మెమోగ్రఫీ వైద్య పరికరాన్ని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు.

ఉచితంగా ఆపరేషన్లు



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రొమ్ము క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించేలా ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశాం. ప్రాథమిక దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించి ప్రాణాంతకం కాకుండానే వ్యాధి నుండి విముక్తి కల్పించాం. క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు త్వరలోనే రెండు పడకలతో మరో క్యాన్సర్ సెంటర్ నిర్మాణం జీజీహెచ్‌లో చేపడుతున్నాం.

నన్నపనేని సదాశివరావు,
నాట్కో ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్

రొమ్ములో గడ్డలను అశ్రద్ధ చేయవద్దు



జన్యుపరమైన లోపాలవల్ల, వంశపారంపర్యంగా, ఇన్‌ఫెక్షన్ల వల్ల, ఒక్కోసారి ఎలాంటి కారణం లేకుండానే రొమ్ములో గడ్డలు ఏర్పడతాయి. రొమ్ములో ఉండే ప్రతి గడ్డ క్యాన్సర్ గడ్డ కాదు. అయితే ప్రతి గడ్డను కూడా అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించి పరీక్ష చేయించుకోవటం ద్వారా నిర్ధారించుకోవచ్చు. తద్వారా రేడియేషన్, ఆపరేషన్ లాంటివి లేకుండా వైద్యం చేసి కొద్ది రోజుల్లోనే వ్యాధిని తగ్గించవచ్చు.

–డాక్టర్ బైరపనేని స్రవంతి,
క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

తొలిదశలోనే గుర్తించవచ్చు



తొలి దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు మెమోగ్రామ్ పరీక్ష చేస్తారు. రెండు మిల్లీమీటర్ల కన్నా తక్కువ సైజులో రొమ్ములో గడ్డలు ఉన్నా గుర్తించి వెంటనే వైద్యం చేయవచ్చు తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే వ్యాధి నుంచి త్వరితగతిన కోలుకోవటంతోపాటుగా మరణాన్ని తప్పించవచ్చు.

– డాక్టర్ చక్కా సుజాత,
సీనియర్ రేడియాలజిస్ట్, గుంటూరు

తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



బృందావన గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు



నగరంపాలెం: పండుగల్లో మొదటిది అయిన తొలిఏకాదశి పర్వదినాన్ని గుంటూరు నగరంలో భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రాతఃకాలంలోనే దేవాలయాలకు తరలివెళ్లి స్వామివార్లకు అర్చనలు, అభిషేకాదులను శ్రద్ధగా ఆచరించారు. బృందావన్ గార్డెన్స్, మల్లారెడ్డి నగర్, పాతగుంటూరు, కొత్తపేట, మారుతీనగర్, ఆర్.అగ్రహారం, సంపత్‌నగర్ ప్రాంతాల్లోగల ప్రధాన దేవాలయాలు పండుగ సందర్భంగా భక్తులతో కిక్కిరిసి కనిపించాయి. పర్వదినం సందర్భంగా దేవతామూర్తులను సుందరంగా అలంకరించారు. కొన్ని దేవాలయాల్లో తీర్థ,ప్రసాద వితరణతోపాటుగా పేలపిండిని కూడా అందించి పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. అలాగే తొలి ఏకాదశి సందర్భంగా బృందావన్ గార్డెన్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామిని దర్శించుకునేందుకు బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని ఆలయ ప్రధాన అర్చకులు మాధవస్వామి బృందం విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలను నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సత్సంగ సభ్యుల కోలాటం జరగ్గా, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య పర్యవేక్షించారు.

దళిత రాజకీయ చైతన్యం అవసరం



మాట్లాడుతున్న ప్రకాష్

నెహ్రూనగర్: 1985లో కారంచేడు దళితులపై అగ్రకుల భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ఫలితంగా దళిత ఆత్మగౌరవ పోరాట బావుటా దేశంలో సరికొత్త సామాజిక శక్తిగా మారి నూతన చట్టాలను సాధించి రాజ్యాంగ హక్కులు పొందగలిగామని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ తెలిపారు. కారంచేడు దళిత అమరవీరుల సంస్మరణ సభ నగరంలోని అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కో ఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, ప్రజా పోరు రాష్ట్ర అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరరావు, దళిత మహాసభ రాష్ట్ర నాయకులు కొరబండి బాబురావు, డెమోక్రటిక్ పార్టీ అధినేత టెన్నిస్ రాయ్, చార్వాక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్, యానాది హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు బాపట్ల ఏసుబాబు, ఆర్‌పీఐ అత్వలే పార్టీ రాష్ట్ర నాయకులు వి.ముత్తయ్య, భీమ్ భారత్ జిల్లా నాయకులు ఆనంద్, ఆంధ్రప్రదేశ్ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు, మాల మహానాడు రాష్ట్ర నాయకులు బత్తుల అనిల్ బాబు, బీఎస్పీ జిల్లా నాయకులు చిరతగుంట్ల వాసు, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో

కారంచేడు ఘటన సమాజానికి మాయని మచ్చ అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు పేర్కొన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో కారంచేడు మృతవీరులకు సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మక్కెన ప్రభాకర్, సుబ్బయ్య, అబ్రహం, చంద్రోశేఖర్, బాబూరావు, ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

కేఎల్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో చదివిన 1995– 1999 బ్యాచ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం పూర్వ విద్యార్థులలో స్నేహభావాన్ని పెంపొందించి గత జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి స్ఫూర్తిని పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో , రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, పూర్వ విద్యార్థులు సంబంధాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.సిహెచ్.కావ్య, ఉద్యోగ కల్పనల డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం .సుమన్, సీఎస్ఈ రెగ్యుల్ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు వీల్‌చైర్స్ వితరణ



వీల్‌చైర్స్ అందజేస్తున్న సభ్యులు

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ కేర్ సెంటర్‌లో రోగులకు మంచి వైద్యం అందించడంతో రోగుల సహాయకులు దాతృత్వాన్ని చాటుకుంటున్నారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం క్యాన్సర్ రోగులకు లెప్రసీ సొసైటీ సభ్యులు రూ. 20 వేలు విలువ గల మూడు వీల్ చైర్స్‌ను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు మంచి వైద్యం అందించడం వల్ల సంతోషంగా వెళ్తున్నారని చెప్పారు. క్యాన్సర్ రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని, అందువల్ల ఆసుపత్రి అభివృద్ధి కోసం వీల్ చైర్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు ఆషా సజని, గంగమ్మ, నాట్కో క్యాన్సర్ సెంటర్ కో–ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్, సొసైటీ కో– ఆర్డినేటర్ మామిడి రాధిక, పి.గోపాలకృష్ణ, వరలక్ష్మి, లలిత సుందరి పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

నగరంపాలెం: స్థానిక హౌసింగ్‌బోర్డుకాలనీ షిరిడి సాయినాథ మందిరంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా పంచామృతాలతో అభిషేకం, అర్చన, అలంకార పూజలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఏకాహం జరిగింది. అన్న ప్రసాద వితరణ చేయగా, అధ్యక్షులు మామిడి సీతారామయ్య, గౌరవ అధ్యక్షులు మామిడి రామారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పెదరావూరు స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు సరెండర్

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలి మండలం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు జిల్లా విద్యా శాఖధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలను బోధించడం లేదంటూ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఇటీవల జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి స్వయంగా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ అధికారులను నియమించి నివేదిక తెప్పించుకున్న డీఈవో శైలజ సదరు ఉపాధ్యాయుడిని సరెండర్ చేసి, పాఠశాలలో వేరొక ఉపాధ్యాయుడిని తెలుగు బోధించుటకు నియమించినట్లు తెలియజేశారు.

పారిశుద్ధ్య పనుల కోసం వీక్లీ యాక్షన్ ప్లాన్ అవసరం

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, వేదికపై కీర్తి

గుంటూరు వెస్ట్: గుంటూరు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు వీక్లీ స్పెషల్ యాక్షన్ ప్లాన్ ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరితో కలసి అధికారులు, సిబ్బంది సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల అమలులో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మెరుగైన పారిశుద్ధ్య సేవలతో పాటు తాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరగాలని కోరుకుంటారన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని చెప్పారు. అవుట్ ఫాల్ డ్రైన్స్‌లో పూడికతీత పనులు జరుగుతున్నప్పటికీ అంతర్గత వీధుల్లోని డ్రైన్లలో ఇది జరగడంలేదన్నారు. ఇక నుంచి ప్రతి రోజూ మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ ద్వారా అంతర్గత డ్రైన్ల శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ మలేరియా పనులు చేపట్టాలని సూచించారు. కీర్తి చేకూరి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం వీక్లీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామన్నారు. నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ నిర్వహిస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు జీఎంసీ నుంచి వచ్చే వాహనాలకు చెత్త ఇవ్వాలని, రోడ్ల మీద, కాల్వల్లో వేస్తే అపరాధ రుసుం విధిస్తామన్నారు. వీధి కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నామని, సమస్యల తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని వివరించారు. సమవేశంలో ఎస్ఈ శ్యాం ప్రసాద్, ఎంహెచ్ఓ మధుసూధన్, డీసీపీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాలి

సీపీఎం నేత బాబూరావు డిమాండ్



మాట్లాడుతున్న బాబూరావు

లక్ష్మీపురం: కొత్తగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడిపేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి వై.నేతాజీ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ తక్షణం అవసరమైన పరిపాలన భవనాలను నిర్మాణం చేయాలన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు ఇస్తూనే కాలపరిమితిని పెంచాలని కోరారు. అసైన్డ్ రైతులకు ప్యాకేజిని పెంచాలని, రైతులకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలోని పేదల జీవన ప్రమాణాలను పెంచే విధంగా వారికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు ఇస్తున్న పెన్షన్లు నెలకు 6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, వెనుబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కోసం కేంద్రంపై పోరాడాలని పిలుపు నిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు, పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌ను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా అన్ని ఇసుక రీచ్‌లను తెరిచి వాటికి దారులు ఏర్పాటు చేయాలని, పేదలకు ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని, కౌలు రైతులకు యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని సమావేశం తీర్మానించినట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఈమని అప్పారావు, కె.నళినికాంత్, ఎం.భావన్నారాయణ, ఎం.రవి సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జె.వి.రాఘవులు, నాయకులు ఎల్.అరుణ, డి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ఎమ్మెల్యేకు వినపతి పత్రం అందజేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు విన్నవించారు. స్థానిక మాయాబజార్‌లోని తూర్పు నియోజక వర్గ శాసన సభ్యులు షేక్ నసీర్ అహ్మద్‌ను ఆయన కార్యాలయంలో కలసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ బోర్డును నిలుపుదల చేసి జీఓ నంబర్ 17ను ప్రవేశపెట్టి కార్మికులకు అన్యాయం చేసినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే షేక్ నసీర్ అహ్మద్ స్పందిస్తూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏకలవ్యుని ఆదర్శంగా సంక్షేమానికి కృషి

నెహ్రూనగర్: విలువిద్యతో ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన మహోన్నత వ్యక్తి ఏకలవ్యుడని ఏకలవ్య విగ్రహ కమిటీ అధ్యక్షులు కుందనాటి సంజయ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జయంతిని పురస్కరించుకుని నాజ్‌సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్యుడి వారసులైన ఎరుకల జాతి వారి అభివృద్ధి ఎక్కడ వేసి గొంగళి అక్కడే ఉందన్నారు. వారి అభ్యున్నతి కోసం ఎరుకుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. నేటి యువత ఏకలవ్యుడి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, శ్రీనివాస్, కట్టా వెంకటేశ్వర్లు, అంథోని, దాసు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వక్తృత్వ, క్విజ్ పోటీలు



సభ్యత పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

లక్ష్మీపురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు ఆగస్టు 11వ తేదీన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక బ్రాడిపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం పొంది 75 ఏళ్లు గడిచిన సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైజ్ఞానిక స్పృహను పెంచే విధంగా వివిధ రకాల కార్యక్రమాలను జేవీవీ చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జాన్ బాబు, నాయకులు డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్, గోరంట్ల వెంకటరావు, ఎస్ఎం సుభాని, ఉదయ భాస్కర్, శంకర్ సింగ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

యథావిధిగా రైళ్లు కొనసాగింపు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైళ్ల కొంత గడువు వరకు మాత్రమే ప్రయాణించేలా ప్రణాళికలు రూపొందించిన విషయం తెలిసిందే. అవే రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం మరలా యథావిధిగా కొనసాగించడం జరుగుతుందని డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ బుధవారం రాత్రి వెల్లడించారు. రైలు నంబర్ 12603, 12733, 17015 రైలు నడికుడి మీదుగా యధావిధిగా ఈనెల 21వ తేదీ నుంచి కొనసాగుతుందని తెలిపారు. రైలు నంబర్ 12603, 12733, 17015 పిడుగురాళ్ళ మీదుగా, 12603, 17015 రైలు ఈనెల 21వ తేదీ నుంచి యథావిధిగా సత్తెనపల్లి మీదుగా, 17232 రైలు సత్తెనపల్లి మీదుగా, 17232, నడికుడి మీదుగా 17232 పిడుగురాళ్ల మీదుగా ఈనెల 22వ తేదీ నుంచి యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.17625 వేజండ్ల, 17216 గిద్దలూరు, 17256 మంగళగిరి మీదుగా ఈనెల 21 నుంచి యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. 17643 మంగళగిరి మీదుగా ఈనెల 23 నుంచి, 17216 మార్కాపురం రోడ్డు, 12733, 17015, 12603 మిరియాలగూడ, 17255, 12603, 17015 నల్గొండ మీదుగా, ఈనెల 21నుంచి, యాథావిధిగా రైళ్ల కొనసాగుతాయని తెలిపారు. 17613 న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ మీదుగా, 17212 కంభం మీదుగా ఈనెల 23వ తేదీ నుంచి, 17232 మిరియాలగూడ, 17232 నల్గొండ మీదుగా ఈనెల 22వ తేదీ నుంచి యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. ప్రయాణికులు గమనించి సురక్షితమైన ప్రయాణం చేయాల్సిందిగా తెలియజేశారు.

